పరమ నాస్తికుడయిన
అతను
భక్తుడుగా
ఎలా మారాడు?

# సమయం చెక్కిన శిల్పం

కె.మురళీకృష్ణ
కథ

'శరత్‌ని కలిశావా?' అన్నం కలుపుతూ అడిగాడు సత్యం.

'లేదు. బండి దిగి తిన్నగా ఇటే వచ్చాను' తల ఎత్తకుండా చెప్పాడు గోపాలం.

'వాడు చాలా మారిపోయాడు తెలుసా?—

గోపాలం తెలియదన్నట్టు తల ఊపాడు.

శరత్, గోపాలం, సత్యంలకు డిగ్రీ చదివేప్పటి నుంచీ పరిచయం ఉంది. ఉద్యోగ రిత్యా గోపాలం ఢిల్లీ వెళ్లాడు. సత్యం రూర్కీలో ఉద్యోగం చేసేవాడు. నెల క్రితం హైదరాబాద్ ట్రాన్స్‌ఫరయి వచ్చాడు. శరత్‌కు చదువు పూర్తికాగానే హైదరాబాద్‌లోనే ఉద్యోగం దొరకటంతో ముగ్గురూ మూడు దిశలయ్యారు. ఉత్తరాల ద్వారా వాళ్ళ పరిచయం కొన్నాళ్లు సాగింది. కానీ గత రెండు సంవత్సరాల నుండీ వీరిద్దరికీ శరత్ నుంచి ఉత్తరాలు రావటంలేదు. సత్యం హైదరాబాదు రావటంతో గోపాలం కూడా ఒక పూటకని హైదరాబాద్ వచ్చాడు. తెల్లవారే తిరిగి ఢిల్లీ వెళ్లే రైలెక్కాలి.

'అసలు ఇప్పుడు వాడిని చూసిన వాళ్లెవరూ మనకు తెలిసిన శరత్ విషయాలు చెప్తే నమ్మరు. ఒకోసారి వాడూ వీడూ ఒకటేనా అన్న అనుమానం వస్తుంది. కాలం మనుషులలో మార్పు తెస్తుందని తెలుసు కానీ ఇంత మార్పు ఊహాకందనిది'.

'ఇంతకీ అంత మార్పేం వచ్చింది?'



చేయి కదుక్కుంటూ అగిగాడు గోపాలం.

'ఏం మార్పని చెప్పాలి? పూర్తిగా రూపాంతరం చెందితే!' గోపాలం నవ్వాడు.

'నిజం శరత్‌ని చూస్తే నువ్వు నవ్వులాటగా తీసెయ్యలేవు'.

అంత మార్పేమిటోయ్? కాస్త చెప్తే వివరిస్తాను'.

'ఇప్పుడు శరత్ మహాభక్తుడు'.

సత్యం మాట పూర్తి కాకముందే కెవ్వున కేకేశాడు గోపాలం.

వెంటనే గట్టిగా నవ్వటం ప్రారంభించాడు. నవ్వటం ఆపి అన్నాడు.

'చూడూ నా చెవిలో చెట్టు మొలిచి పూలు పూసిందన్నా నిజమేమో అనుకుంటాను కానీ, శరత్ దైవ భక్తుడంటే నేను నమ్మను గాక నమ్మను'.

చదువుకునే రోజుల్లో శరత్ హేతువాది. దేనికయినా కారణాలు కావాలి అనేవాడు. ప్రతి విషయాన్నీ చీల్చి చెండాడేవాడు. దేవుడు, దయ్యం అంతా బూటకంఅని కొట్టి పారేసేవాడు. మనుషులంతా ఒకటయినప్పుడు కులం, మతం ప్రసక్తులు ఎలా ఉండకూడదో దైవం అనేది ఉంటే అది అందరికీ ఒకటేనని మతానికో దేవుడంటూ ఉండటం అనవసరం అని వాదించేవాడు. దేవుడు లేడని శరత్‌లా ధైర్యంగా వాదించలేక, ఉన్నాడని మనస్ఫూర్తిగా నమ్మలేక గోపాలం బాధపడేవాడు.

తన భావాలను ఎవరేమనుకున్నా పట్టించుకోకుండా చెప్పే శరత్ గోపాలంకు ఆదర్శమయ్యాడు. శరత్ అభిప్రాయాలన్నిటితోనూ గోపాలం ఏకీభవించకపోయినా కొన్ని మాత్రం సమంజసమైనవేనని గోపాలం భావించేవాడు. శరత్ స్నేహం వల్ల గోపాలం తనకు తెలియకుండానే ఎంతో ప్రభావితమయ్యాడు.

శరత్ అభిప్రాయాలు ఉట్టి వాదనకే పరిమితం కావు, ఆచరణలో పెట్టేవాడు. తనకు ఊహ ఇంకా రానప్పుడే ఉపనయనం చేశారు. తనకు ఇప్పుడా జంధ్యంవలన ఎటువంటి లాభం కనిపించటం లేదని దాన్ని తెంచి పడేశాడు. 'బ్రాహ్మణ పుటకపుట్టి ఇదేం బుద్ధిరా?' అని వాళ్ల నాన్న మందలిస్తే 'అందరూ ఎలా పుడతారో నేనూ అలాగే పుట్టాను. బ్రాహ్మణ పుటక, శూద్రపుటక అని వేరేవేరే పుటకలుండవు. అదీకాక నేను బ్రాహ్మణుడిని ఎలాగవుతాను? నువ్వు నమ్మే శాస్త్రాల ప్రకారమే బ్రాహ్మణత్వం వంశపారం పర్యం వల్లకాదు చేతల వల్ల వస్తుంది. నేనేం చేశానని నాకు బ్రహ్మణత్వం అంటగడుతున్నారు? అని ప్రశ్నించాడు.

ఒకసారి ఓ ఫ్రెండింట్లో సత్యనారాయణ వ్రతమని పిలిస్తే వెళ్లాడు. అక్కడ పూజారి కథ చెప్తున్నంత సేపూ గోలగోల చేశాడు. 'ఇదే దేవుడండి? తనని పూజించకపోతే దేవుడు శిక్షిస్తాడన్న మాట. అంత క్షమా గుణం లేనివాడు దేవుడిలా అయ్యాడు? ఇటువంటి దేవుడు నాకొద్దు బాబోయ్!' అని ఏడ్పించాడు.

ఇంకోసారి పెళ్లికెళ్లినప్పుడు 'ఈ పెళ్లిళ్ల పద్ధతులే విచిత్రం. ఫోటోలు, జాతకాలు చూసి ఓ.కె. అంటారు. కట్నాలు కానుకలు మాట్లాడుకుంటారు. ఇక అంతే, జీవితాంతం కలిసి ఉండ్రా అని కట్టి పడేస్తారు. ఇదే జీవితమోయ్? ఏదో వ్యాపారం ముందు లాభనష్టాలు బేరీజు వేసుకున్నట్టు పెళ్లికి ముందు కట్నాలు లెక్కలు వేసుకుంటారు. ఇక ఈ పెళ్లిళ్లకి ప్రతివాడినీ బతిమాలి మరీ పిలుస్తారు. వీళ్ల పెళ్లి సమయానికి రాలేకున్నా భోజనాల సమయానికయినా వస్తారు. ఇంతమందికి ఇంత ఖర్చు చేసి భోజనాలు పెట్టిస్తారు.

రేపు అవసరమైనప్పుడు వీళ్లల్లో ఏ ఒక్కడ యినా సహాయానికి వస్తాడా? ఎందుకీ దండుగ?' అని వాదించాడు.

క్లాసులో ఉన్న ముస్లింల దగ్గరకెళ్లి 'ఇస్లాం అంటేనే బానిసత్వం. ప్రశ్నించకుండా ప్రవక్త చెప్పిందే పాటించడం. మరి గుడ్డిగా చెప్పింది వినేటప్పుడు మీ వ్యక్తిత్వం, ఆలోచనలు అన్నీ ఎక్కడ పాతిపెడతారు?' అని వాదిస్తాడు.

క్రిష్టియన్ల దగ్గరకెళ్లి 'మీరంతా పాపులు ఎలా అయ్యారు? మీరు పాపాలు చేస్తే మీ భగవంతుడు శిక్షనెందుకు అనుభవించాలి? దానికి మీరెందుకు సంతోషించాలి? ఆ శిలువను మీరెందుకు పూజించాలి?' అని విమర్శించేవాడు.

ఒకసారి అందరూ కూడబలుక్కుని తన్నటానికి వచ్చారు. అయినా శరత్ బెదరలేదు. 'నన్ను కొట్టి మీరు నా అభిప్రాయాలను మార్చలేరు. చేతనయితే వాదించి మార్చండి' అని ఛాలెంజ్ చేశాడు.

ఇదిలా ఉండగా ఒకసారి వాళ్ల నాన్నగారు ఎవరో స్వామీజీని ఇంటికి ఆహ్వానించారు. స్వామీజీల విషయమొస్తే శరత్ ఒళ్లే మరచిపోతాడు. 'వీళ్లంతా చిల్లర దేవుళ్లోయ్. వీళ్ల కాళ్లకు మొక్కి వీళ్లే దేవుళ్లని భావించటం కన్నా మూర్ఖత్వం ఇంకోటి లేదు. వీళ్లూ నశ్వర శరీర ధారులే. వీళ్లకీ, మనకీ తేడా ఏమీలేదు. అటువంటప్పుడు వాళ్లు దేవుళ్లెలా అవుతారు? అయినా సంసారాన్ని త్యజించిన వాడికి ఆశ్రమాలు, విరాళాలు, ఏసి గదులు, ఏసి కార్లు ఎందుకు? మనం ఏవో పచ్చడి మెతుకులు తింటాం. ఈ సన్యాసి ఒక్క పూట తిండికి మన ఒక నెల జీతం ఖర్చవుతుంది. ఎందుకోయ్ ఈ వెర్రి వ్యామోహం? నిజంగా దేవుడి మీద నమ్మకం ఉంటే విశ్వసృష్టి కారకుడయిన ఆ అనంత శక్తి మీద దృష్టి కేంద్రీకరించమను. అదీ స్వలాభాపేక్ష లేకుండా ! ఈ పనయితే గుండు కొట్టుకునే ఈ ఆస్తికుల



కొక్కళ్లకూ అదీ సాధ్యం కాదు' అంటాడు.

ఈ విషయంలో నాన్నగారితో తగాదా పడి ఇంట్లోంచి బయటకు వచ్చేశాడు. అలా ఆరు నెలలు వేరుగా ఉన్నాడు. చివరకు అమ్మకు ఆరోగ్యం పాడవటంతో తిరిగి కలిసిపోయాడు. శరత్‌కు వాళ్ల అమ్మ అంటే అమితమైన ప్రేమ. బహుశా అతను ఆమెని ప్రేమించినంతగా ఇంకెవరినీ ప్రేమించలేడేమో అనిపించేది. 'వీళ్లంతా కనిపించని దేవుళ్ల వెనక్కాల పడతారు. కనిపించి కళ్లెదుటే ఉండే మాతృమూర్తి గోడు పట్టించుకోరుగానీ... తల్లిని మించిన దైవం ఎవరయినా ఉంటే చూపించండి?' అంటాడు.

శరత్ తన సిద్ధాంతాల ప్రకారం తన అభిప్రాయాలకు సరిపడ అమ్మాయిని రిజిస్ట్రాఫీసులో పెళ్లి చేసుకున్నాడు. సాక్షి సంతకం పెట్టి కంగ్రాట్స్ చెప్పిన వాళ్లని అదరగొట్టేశాడు.

'అభినందన లెందుకు? మేం కలిసి ఉండాలని నిశ్చయించుకున్నాం. కలసి ఉంటాం. దాన్లో అభినందించాల్సినంత గొప్పేముంది? మేం ఇద్దరం మంచి మిత్రులం, మిత్రుల్లాగే ఉంటాం. వేనేదో తినిపిస్తానని ఆశ పడుతున్నారేమో? అటువంటిదేమీ లేదు.'

శరత్ ఫ్రెండు పేరు రాధ. రాధ అంటే కృష్ణుడు గుర్తుకొస్తాడని నీహారిక అని పిలుస్తాడు.

ఈ రకంగా తాను నమ్మినదాన్ని ఎవరేమనుకున్నా పట్టించుకోకుండా ఆచరించే వాడు శరత్. అటువంటి శరత్ ఇంతగా భక్తుడిలా మారిపోయాడంటే గోపాలంకు నమ్మబుద్ధి కాలేదు.

'చూశావా ఒక్క మాటకే ఎంత బెదిరిపోయావో! ఇక వాడిని చూస్తే గుండె ఆగిపోతుంది. మొహాన విభూది, మెడలో రుద్రాక్షమాలలు, ఒక్క కాషాయవస్త్రాలు తక్కువ సన్యాసి లాగా ఉంటాడు. వాడి ఇంటి నిండా దేవుళ్ల పటాలు , రక్షరేకులు దర్శనమిస్తాయి. వారానికి ఒక రోజయినా పెద్ద ఎత్తున భజనలు ఏర్పాటు చేస్తాడు. వెనీవూరు వొచ్చిన తరువాత రెండు మూడు సార్లే కలిశాను. ఇక కలవాలనిపించలేదు. ఇంతకు ముందున్న ఆప్యాయత, అనురాగం, ఆవేశం మనిషిలో కనిపించవు. అంటే ముట్టనట్టుంటాడు' సత్యం కంఠంలో ఆవేదన ధ్వనించటం గమనించాడు గోపాలం.

'ఇంతకీ ఇంత మార్పు ఎలా వచ్చిందంటావు?' సాలోచనగా అడిగాడు గోపాలం.

'నాకూ సరిగ్గా తెలియదు. కానీ వాళ్లూ వీళ్లూ అనుకోగా తెలిసిందేమిటంటే దాదాపుగా వాళ్ల అమ్మపోయిన సంవత్సరం మంచీ ఇలా మారిపోయాడట. వాడికి ఉద్యోగం వచ్చిన కొన్ని రోజులకే వాళ్ల నాన్నగారు పోయారు. వాళ్లమ్మ ఎంత బతిమిలాడినా కర్మకాండలు చెయ్యలేదు. ఆరు నెలల్లోగా వాళ్లమ్మ కూడా పోయింది. ఆమెకూ కర్మకాండలు చేయలేదట. ఆ తరువాత వరుసగా శరత్‌కు ఇద్దరు అమ్మాయిలు పురిటిలోనే చనిపోయారట. వాడి భార్యకు అనారోగ్యం వచ్చిందట. ఎంత మంది డాక్టర్ల దగ్గరకెళ్లినా ఫలితం కనిపించలేదట.

చివరికెవరో తల్లిదండ్రులకు కర్మకాండలు జరిపించి దేవుడి మీద నమ్మకం ఉంచుకొమ్మని చెప్పారట. ఆ పని చేసినప్పటి నుంచీ వాడి కష్టాలు తొలగి పోయాయట. ఇగో అప్పటి నుంచీ ఇలా మారిపోయాడు'.

'అంటే కష్టాలు రాగానే లొంగిపోయాడన్న మాట' అనుకున్నాడు గోపాలం. శరత్ ప్రభావం వల్ల గోపాలం పూర్తి నాస్తికుడు కాకపోయినా హేతువాది అయ్యాడు. కానీ శరత్ ఒక చిన్న తుఫానుకే మానసిక స్థైర్యం కోల్పోయి ఇలా మానసిక దౌర్బల్యానికి లోనవుతాడని గోపాలం అనుకోలేదు. ఆస్తికత మానసిక దౌర్బల్యానికి నిదర్శనమన్న రస్సెల్స్ సిద్ధాంతం గోపాలంకు నచ్చింది.

'ఇవాళ్ల సాయంత్రం ఎలాగయినా వాడిని కలవాలి' అన్నాడు గోపాలం.

'సాయంత్రం ఆరు గంటలకల్లా వాడు మునిసిపల్ మైదానంలో భజనలకు తప్పని సరిగా హాజరవుతాడు. మనం ఆరు కంటే ముందే వెళ్లి వాడు లోపలకెళ్లేలోగా పట్టుకోవాలి. లేకపోతే ఎనిమిది దాకా చిక్కబడి పోతాం. అయినా నిమ్నా నమ్నా చూసి వాడు భజనలు మానుకుంటాడా అనేది సందేహాస్పదమే.

సాయంత్రం అయిదున్నరకల్లా ఇద్దరూ మున్సిపల్ మైదానం చేరారు. వచ్చే వాళ్లందరినీ పరీక్షిస్తూ కూచున్నారు. ఆరయినా శరత్ జాడలేదు. భజన ప్రారంభమయింది. శరత్ రాలేదు. 'వాడు తప్పకుండా రావాలి. ఇవాళ్లెందుకు రాలేదో?' అన్నాడు సత్యం.

ఇంతలో దూరంగా పరుగెత్తుకుంటూ వస్తున్న వ్యక్తిపై పడింది ఇద్దరి దృష్టి. శరత్ అచ్చు సత్యం వర్ణించినట్టే ఉన్నాడు. శరత్‌ని పిలిచాడు సత్యం. శరత్ వీళ్లిద్దరి వైపుకు వచ్చాడు. గోపాలంని గుర్తు పట్టాడు. 'గోపాలం నువ్వు నాతో పాటు రా! సత్యం నువ్వొస్తే రా నీ ఇష్టం' అని గోపాలం చెయ్యిపట్టుకుని లాక్కెళ్తూనే

## పెళ్ళి!



"మనం ఇకనైనా పెళ్ళి చేసుకుందాం డియర్" ముద్దుగా అడిగింది బీచ్‌లో ప్రియుడి ఒడిలో తలపెట్టి పడుకొని రమ"

"అయితే నువ్వు నా భార్యవి కావా! పరాయి మగాడితో తిరగడానికి సిగ్గు లేదూ! పెళ్ళికి ముందు నాకిలాంటివి అస్సలు నచ్చవు" అంటూ వెళ్ళి పోయాడు ఆ మతిమరపు ప్రియుడు.

– పి.సరోజ (నీరాల)

ఉన్నాడు. గోపాలం శరత్‌ని ఆపాడు.

'నీతో మాట్లాడాలని ఢిల్లీ నుంచి వచ్చానోయ్. ఏమిటా తొందర?'

'నాతో వాదించకు. ఇప్పటికే ఆలస్యమయింది. ఇవాళ్ల నాతో పాటే ఉండు. సత్యం కివన్నీ ఇంటరెస్టు లేదు. నీకు వేరే పనేం లేదుగా?' ఆగకుండా ఎవరో తరుము కొస్తున్నట్టుగా మాట్లాడుతున్నాడు శరత్. తమతో మాట్లాడుతున్నా శరత్ దృష్టి భజనమీదే ఉన్నట్టు పసికట్టాడు గోపాలం. సత్యంతో అన్నాడు 'నువ్వూ రారాదు!'. సత్యం తల అడ్డంగా తిప్పాడు. 'నాకివన్నీ బోరు. నేను వస్తాను' అని వెళ్లిపోయాడు.

గోపాలంని దాదాపుగా లోపలకు లాక్కెళ్లాడు శరత్. ముందు వరుసలో కూచున్నారు. లోపలకు వెళ్తూనే భజన అందుకున్నాడు శరత్. వరుసలో కూర్చునే సరికే తన్మయుడై పోయాడు. పక్కన గోపాలం ఉన్న ధ్యాసే లేదు. గోపాలం చుట్టూ ఉన్న వారివి పరిశీలిస్తూ కూచున్నాడు. అందరూ పాటకు తగ్గట్టుగా ఊగుతున్నారు. వరుసలో అక్కడక్కడా కొందరు లోగొంతుకలో ఏవో మాట్లాడుకుంటున్నారు. ఎనిమిది అవుతుండగా భజన అయిపోయింది. తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అక్కడందరూ శరత్ పరిచయస్థులలాగే ఉన్నారు. అందరూ పలకరిస్తున్నారు. అక్కడ నుంచి బయట పడేసరికి తొమ్మిదయింది.

'రాత్రికి ఇంట్లో ఉండిపో' స్కూటర్ స్టార్ట్ చేస్తూ అన్నాడు శరత్.

'నేను రేపు ప్రొద్దున్నే ఏ.పీ. కెళ్లాలి'.

'నిన్ను బండీ ఎక్కించే బాధ్యత నాది. సామాన్లు సత్యం ఇంట్లో ఉన్నాయా?'

'సామాన్లేం లేవు. ఒక్క పూటకే వచ్చాను. చిన్న బ్యాగ్ ఉంది. అది కొలీగ్ దగ్గర ఉంది. రేపు రైలు దగ్గరకు పట్టుకు వస్తాడు'.

'సామాన్లేం లేకుండా ప్రయాణం చేసే అలవాటు ఇంకా మారలేదన్నమాట'. ఇద్దరూ శరత్ ఇంటికెళ్లారు. ఇల్లు సత్యం వర్ణించినట్టుగానే ఉంది.

ఇంట్లో అడుగుపెడుతూనే 'రాధా గోపాలం రాత్రికి ఇక్కడే ఉంటాడు' అని ఓ కేక పెట్టాడు.

రాత్రి భోజనాలయ్యాక శరత్, గోపాలం వరండాలో కూర్చున్నారు. పున్నమి వెన్నెల వరండా ముందున్న మొక్కలన్నిటి మీదా పరుచుకుని ఉంది. చల్లని గాలి వీచినప్పుడల్లా వెన్నెల గోలి సంతృప్తితో ఆ మొక్కలు తలలాడిస్తున్నట్టు అనిపించింది.

'నేను సత్యంతో అలా మాట్లాడటం నీకు ఆశ్చర్యంగా అనిపించి ఉండవచ్చు'.

తలూపాడు గోపాలం.

'ఎదుటి వ్యక్తితో ఏకీభవించకపోయినా అతని భావాలను గౌరవించటం ప్రతి వ్యక్తీ నేర్చుకోవాలి. అది సత్యంలో లేదు. అతడి వ్యంగ్యాన్ని భరించేంతగా నేనింకా ఎదగలేదు'.

'అసలేమిటి ఇదంతా? నువ్వే ఆ శరత్ వంటే నమ్మలేకపోతున్నాను. ఈ భజనలేమిటి? ఆ దేవతల ఫోటో లేమిటి? 'అసలీ పిచ్చి ఎలా పట్టింది నీకు?' అప్పటిదాకా అణచుకున్న గోపాలంలోని సందేహాలు

ఉవ్వెత్తున ఎగసిపడే కెరటాల్లా బయటకు వచ్చాయి.

శరత్ నవ్వాడు. శరత్ కళ్లల్లో ఒకరకమైన ప్రశాంతత గమనించాడు గోపాలం. ఇంతకు ముందులా తీక్షణంగా లేవు. నిండుగా, మంద్రంగా ప్రవహించే గోదావరి లా ఉన్నాయి. ఏదో భయం కలిగింది గోపాలంకు.


'పిచ్చి అంటే ఏమిటోయ్? ఈ ప్రపంచంలో ప్రతివాడికీ ఏదో ఒక పిచ్చి ఉంటుంది. నేను దేవుడు లేడని వాదించినప్పుడూ నాకు పిచ్చి అన్నారు. ఇప్పుడూ పిచ్చి అంటున్నారు. అంటే ఎవరి అభిప్రాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించినా వాడు ఎదుటి వాడికి పిచ్చి అంటగడతాడా?'

గోపాలం మాట్లాడలేదు. ఆ నిశ్శబ్ద నిశీధిలో, వెన్నెల చల్లదనం, శరత్ మంద్ర స్వరం గోపాలంలో ఏదో సంచలనం కలిగిస్తున్నాయి.

'నా స్వభావంలోనే తీవ్రత్వం ఉంది. ఇంతకు ముందు నేను విమర్శించిన విషయాలను ఇప్పుడూ విమర్శిస్తాను. మన సమాజంలో ఎన్నో లోపాలున్నాయి. మనుషుల్లో ఎంతో హిపోక్రసీ ఉంది. మన పద్ధతుల్లో, ఆచార వ్యవహారాల్లో, ఆలోచనా పద్ధతుల్లో ఎన్నో మార్పులు రావాలి. కానీ అప్పటికీ ఇప్పటికీ ఒక్క విషయంలో నాలో మార్పు వచ్చింది. అప్పుడు ప్రతి విషయానికీ కారణాలు, రుజువులూ అడిగే వాడిని. ఇప్పుడొక విషయం తెలుసుకున్నాను. ఎలాగయితే మనకు వినిపించని శబ్దాలు, కనిపించని రంగులూ ఉన్నాయో అలాగే మన మేధకు అందని శక్తులూ ఉన్నాయి. ఆ శక్తికే దేవుడని పేరు పెట్టుకోవచ్చు. ఆ శక్తిని ఆరాధించవచ్చు'.

'మరి ఇన్ని దేవుళ్లు, భజనలు, ఇదంతా ఆత్మవంచన కాదా? నిజం చెప్పు ఆ శక్తి మీ భజనలు వింటూ, మీ పూజలుకంటూ లెక్కలు వేసుకుంటూ ఉంటుందా?

## ఆచారం!



లక్షలు లక్షలు కట్నంగా, పొలాలు, బిల్డింగ్‌లు, మారుతీ వేన్‌లు కట్నంగా యివ్వటం గురించి మనకి తెలిసిందే. అయితే వరకట్నంగా పాముల్ని సమర్పించుకునే సంస్కృతి గుజరాత్ రాష్ట్రంలోని 'కచ్' జిల్లాకు చెందిన 'వాడి' అనే తెగ ప్రజలు పాముల్ని పెంచి, ఆడించి, వాటి చర్మాలను అమ్ముకుని జీవనం సాగిస్తూంటారు.

ఈ గెతలో పెళ్ళికొడుకు వరకట్నంగా పేదవారయితే రెండు మూడు పాముల్ని సమర్పించుకుంటే ... కాస్త ధనవంతుడైతే అయిదారు పాముల్ని అందునా నాగుపాముల్ని కట్నంగా అల్లునికిస్తారట.

— ఎమ్.రజనీశకుంతల (సికింద్రాబాద్)

పూజలు చేస్తేనే మీరు అడిగేవన్నీ ఇస్తుందా?–' శరత్ మాటలకు అడ్డువస్తూ అన్నాడు గోపాలం.

'మనం భజనలు, పూజలు ఏదో ఆశించి చేయకూడదు. ఆయన ఇచ్చేవన్నీ ప్రకృతి రూపంలో ఇచ్చేశాడు. మనకు ప్రకృతిని ఉపయోగించుకునే అవయవాలిచ్చాడు. అవయవాలని నియంత్రించే తెలివిని ఇచ్చాడు వాటిని సక్రమంగా ఉపయోగించుకుని ప్రకృతి నుంచి మనకు కావలసింది మనం రాబట్టుకోవచ్చు. అంతా మనమీద ఆధారపడి ఉంది'.

'మరి ఈ భజనలెందుకు?'

'మనసుపై నియంత్రణ సాధించటానికి ఒక రూపాన్ని ఊహించి ఆ రూపంపై ధ్యానాన్ని కేంద్రీకరించటం ద్వారా నా మనస్సుపై నేను నియంత్రణ పొందగలుగుతాను. తద్వారా నా అంగాలను నేను నిర్దేశించ గలుగుతాను.'

'అది యోగ ద్వారా కూడా సాధించవచ్చు'.

'అవును లక్ష్యాన్ని చేరటానికి అనేక మార్గాలుంటాయి. మనం మనకనువయిన మార్గాన్ని ఎంచుకోవచ్చు'.

'మరి ఒకే శక్తి అయినప్పుడు ఇన్ని దేవతలెందుకు?'

'ఆ శక్తి ఎన్ని రూపాల్లో ప్రదర్శిత మవుతుందో గుర్తుంచుకోటానికే... ఆ శక్తి నీలో ఉంది. నాలో ఉంది. మన మనస్సుకు తగ్గ రూపాన్ని ఎంచుకుని ధ్యానించవచ్చు. భౌతిక విషయాల వెనుక పరుగిడుతున్న నీ మనసును నీలోపలకు మళ్లించుకో. నీ అంతరంగాన్ని శోధించు. నీకే అన్ని ప్రశ్నలకూ సమాధానాలు లభిస్తాయి.'

'నాక్కావలసింది ఈ ఉపన్యాసం కాదు. నీకు కష్టాలు రావటంతోటే నువ్వు భగవధ్యానం ఆరంభించావు. కష్టాలు రాకముందు నీ స్వశక్తి మీద నీకున్న నమ్మకం, కష్టాలు రాగానే సడలి ఏదో అద్భుత శక్తిపై మళ్లింది' ఆవేశంగా అన్నాడు గోపాలం.

'ప్రపంచమంతా నిండి ఉన్న ఆ శక్తికి నా స్వశక్తి, నీ స్వశక్తీ అంటూ ఉండదు. అంతా ఆ శక్తే. ఇది నీది నాది అని మనలను మనం మోసం చేసుకుంటున్నాం. ఈ శరీరం ఎంత వరకూ నీది? ప్రాణమున్నంత వరకే కదా! ఆ తరువాత? కాబట్టి ఏదీ నీది కాదని అంతా ఆ పరమేశ్వరుడిదేనని ఏదో ఒకనాడు అంతా అక్కడికే చేరాలని అర్ధమైన వాడు నిన్ను ఏ కష్టం బాధించలేదు. అవునా?'

గోపాలంకు ఏదో అర్ధమయి అర్ధమవనట్టుగా ఉంది.

'అమ్మ చనిపోయిన తరువాత నేను దాదాపుగా మనస్థిమితం కోల్పోయాను. అమ్మకోసం విపరీతంగా బాధపడ్డాను. నాకు జీవితేచ్ఛ నశించింది. అన్ని విషయాల మీద ఆసక్తిపోయింది. అప్పుడొక రోజు నాకొక వింత అనుభవం ఎదురయింది. అది కలా? నిజమా? ఈ నాటికీ తేల్చుకోలేక పోతున్నాను. కానీ అమ్మ నాకు కనిపించింది.


'అద్దంలో సూర్యుడు కనిపిస్తాడు. ఆ అద్దం పగిలినంత మాత్రాన సూర్యుడు మాయమైపోడు. చూసే కళ్లుంటే జగతి అంతా కనిపిస్తాడు. అలాగే ఈ జన్మలో

నీకు జన్మనిచ్చిన తల్లి దూరమైతేనే ఇంత బాధపడుతున్నావు. అందరికీ జన్మనిచ్చిన విశ్వమాత ఉంది. మీరు ఆ విశ్వమాతను విస్మరించవద్దు. ఆమెను చేరుకునే ప్రయత్నం చేయి' అని చెప్పింది అమ్మ. కానీ ఆ స్వరం అమ్మ స్వరంలా లేదు. అద్భుతమైన సంగీత వాయిద్య స్వరంలా ఉంది. అప్పుడే నేనో నిశ్చయానికి వచ్చాను. మనమంతా ఈ ప్రపంచంలో క్షణకాలం మాత్రమే ఉండిపోయేవాళ్లం. ఈ ప్రపంచాన్ని ఊహించి, ఆ ఊహకు రూపు కల్పించిన ఆ మాతృమూర్తి అన్వేషణకే నా జీవితాన్ని ఆ క్షణం నుంచే అంకితం చేయాలని నిశ్చయించాను'.

' నీ అన్వేషణ ఎంత దూరం వచ్చింది?–

'చూడూ, ముగ్గురి దగ్గర మూడు పాత్రలున్నాయి. ఒకడి పాత్రలో సున్నం, ఇంకొకడి పాత్రలో నూనె, మరింకొకడి పాత్రలో తారు ఉన్నాయి. ఆ పాత్రలను శుభ్రం చేసుకుని రండి భిక్షం వేస్తాను అంటే వాళ్లు భిక్షం పొందే వేగం ఎవరి పాత్రలో ఉన్న పదార్థాన్ని బట్టి, దాన్ని వాళ్లు ఎంత త్వరగా శుభ్రం చేస్తారు అనే దానిపై ఆధారపడి ఉంటుంది. నా పాత్రలో ఏముందో? మాత సాక్షాత్కారం అపుడే అవుతుంది. నా విశ్వమాతను నేను అప్పుడే చేరుకోగలను' శరత్ కళ్లు వింతగా ఆనందంతో మెరిసిపోవటం గమనించాడు గోపాలం.

హఠాత్తుగా గోపాలం మెదడుకు శరత్ ప్రవర్తన అర్థం అయింది. అతని స్వభావంలోని మార్పు అర్థమయింది. మనిషికి కావలసింది డబ్బు, సౌఖ్యం లాంటివి కావు. మనిషికి కావలసింది భద్రత. ఈ భద్రతకోరే ప్రకృతిని చూసి భీతి చెందిన ఆది మానవులు దేవుడిని సృష్టించుకున్నారు. పసిపిల్లవాడు తల్లి దండ్రుల దగ్గర భద్రత కోరతాడు. పెరిగి పెద్దవాడయిన తరువాత తన సన్నిహితుల సాహచర్యంలో సాంత్వన పొందుతాడు. వీరి పరిధికి మించిన



విషయాల్లో భగవంతుడిని కోరతాడు. కాబట్టి మనిషి ఎంత వాడయినా భద్రత అతని గమ్యం. భద్రతాభావం వెంట పరుగిడతాడు మనిషి.

అమ్మ మరణం శరత్‌ని క్రుంగదీసింది. అమ్మకు దూరమవటాన్ని భరించలేని శరత్ మేధ ఒక 'యూనివర్సల్ మదర్', విశ్వమాతను సృష్టించుకుంది. అందులోనే అతనికి ఆనందం ఉంది. అందులోనే అతనికి ప్రశాంతత ఉంది. అందులోనే భద్రత ఉంది. శరత్ విపరీత స్వభావం ఈ భావనను నమ్మిన మరుక్షణం ఆచరణలో పెట్టింది.

ప్రతి మనిషీ అనుభవాల సమూహం. ఎవరి అనుభవాలకు తగ్గట్టు వారు తమకు నచ్చిన సిద్ధాంతాలతో సంతృప్తి పొందుతారు. ప్రపంచంలో ఇన్ని రకాల దేవుళ్లు, వ్యతిరేక సిద్ధాంతాలు ఉండటానికి ఇదే కారణం కావచ్చు.

'నువ్వు రేపు ఉంటే బాగుంటుంది. రేపు స్వామీ పరమానంద వస్తున్నారు. ఆయన చాలా గొప్ప వ్యక్తి...' చెప్తున్నాడు శరత్.

రాళ్లల్లో రూపాంతర శిలలు ఒక రకం. సాధారణంగా ఏర్పడిన రాళ్లు, అనుకోకుండా తమ స్వభావానికి విరుద్ధమయిన పరిస్థితిలోకి భిన్న వాతావరణంలోకి చేరినప్పుడు అక్కడి వొత్తిడికి, వేడికి అనుగుణంగా మార్పు చెందుతాయి. వాటిని రూపాంతర శిలలు అంటారు. బలహీనమైన సున్నపురాయి రూపాంతరం చెందితే పాలరాయి అవుతుంది ఆ వాతావరణానికి తగ్గట్టుగా మారి భద్రంగా ఉంటుంది.

మనిషీ అంతే! ప్రతి మనిషీ సమయం చెక్కిన శిల్పం. కాలం రాసిన కావ్యం! అనుకున్నాడు గోపాలం శరత్ వైపు చూస్తూ

** ** **

